# పచ్చకార్డు - పచ్చని సంసారాలు

విక్రమరావ్ సునీతను, పిల్లల్ని తీసుకుని షార్ప్స్ టౌన్ మాల్‌కి వెళ్ళాడు. అదొక పెద్ద షాపింగ్ సెంటర్. దాంట్లో కొన్ని వందల షాపులు వున్నాయి. కొంతమంది అవసరానికి వస్తువులు, బట్టలు కొనుక్కోటానికి వస్తే, చాలమంది కాలక్షేపం కోసం, సరదా కోసం వస్తుంటారు. కొంతమంది మాల్‌లో ఆ చివర నుంచి ఈ చివరకు నడుస్తుంటారు. అలా జనాన్ని చూసుకుంటూ, కొన్ని మైళ్ళు నడుస్తూ, శరీరంలో వున్న క్రొవ్వు పదార్థాన్ని కరిగించుకోటానికి అదొక సులభమైన మార్గం మరి!

విక్రమరావ్‌కి షాపింగ్ చేయటం అంటే ఏ మాత్రం యిష్టం వుండదు. ఏదన్నా కొనవలసి వస్తే, ఆదివారం వచ్చే 'సేల్' పేపరు చూసి, సరాసరి ఆ షాపుకి వెళ్ళి, ఐదు నిమిషాల్లో కొనుక్కుని ఇంటికి వచ్చేస్తాడు. కాని సునీత అలా కాదు. ఆవిడకి షాపింగ్ పెద్ద సరదా. సోమవారం నుంచి శుక్రవారం దాకా, తను కూడా ఆఫీస్‌లో పని చేస్తుంది. శని, ఆదివారాలు యింటి పని, పిల్లలను మ్యూజిక్‌కి, డాన్స్‌కి, టెన్నిస్‌కి, సాకర్‌కి తిప్పటంతో వీకెండ్‌లో అసలు సమయం చిక్కదు. ఎప్పుడన్నా కాస్త ఖాళీగా అనిపిస్తే మాత్రం షాపింగ్‌కి వెళ్ళి కొన్ని గంటలు గడిపేస్తుంది. ఇద్దరివీ వేరు వేరు మనస్థత్వాలు కనుక షాపింగ్ చేయటంలో ఒక అరేంజ్‌మెంటు చేసుకున్నారు. విక్రమరావ్ మాల్‌లో, మధ్యలో వున్న ఫౌంటెన్ దగ్గర, పిల్లలను పెట్టుకుని కూర్చుంటాడు. సునీత షాపింగ్ పూర్తి చేసుకుని మళ్ళీ అక్కడకు వస్తుంది. అప్పుడు అందరూ కలసి అక్కడే 'పిజ్జా' తిని ఇంటికి రావటం.



అందుకనే సరాసరి ఆ ఫౌంటెన్ దగ్గరకే వెళ్ళారు అందరూ.

"పిల్లలకు బట్టలు కొనాలి ఇవాళ - మీరూ రండి - వార్డ్‌లోనూ, జె.సి. పెన్నీలోనూ కొందాం" అన్నది సునీత.

"వాళ్ళను తీసుకుని - నువ్వు వెళ్ళు - నేను ఇక్కడ కూర్చుంటాను -" అన్నాడు విక్రమరావ్.

"మీరు ఒక్కరూ కూర్చుంటే బోరు కొడుతుంది - పోనీ వాకింగ్ చేయండి!"

నవ్వాడు విక్రమరావ్ - "వాకింగా - నో - ఐ డోంట్ లైకిట్ - ఏం ఫరవాలేదు - నువ్వు వెళ్లు - నేను వచ్చేపోయే పిల్లల్ని చూస్తూ ఇక్కడే కూర్చుంటాను" అన్నాడు.

సునీత పిల్లల్ని తీసుకుని వెళ్ళింది. విక్రమరావ్ ఇటు నించి అటూ, అటు నించి ఇటూ తిరిగే జనాన్ని చూస్తూ, ఆలోచిస్తూ కూర్చున్నాడు. అమెరికా చాల విచిత్రమైన దేశం. మెల్టింగ్ పాట్ ఆఫ్ డిఫరెంటు కల్చర్స్. అయినా ఇక్కడ వున్నంత యూనిటి ఇన్ డైవర్సిటీ ఏ దేశంలోనూ వుండదు. ప్రపంచంలోని అన్ని దేశాల మనుషులూ ఇక్కడ కనిపిస్తారు. యూరోపియన్స్, ఆసియా దేశాల వాళ్ళు, ఆఫ్రికా, దక్షిణ ఆమెరికా, గల్ఫ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ - ఒకటని కాదు - రక రకాల శరీరపు రంగులు, భాషలు, నడవడికలు, ఆచారాలు, ఆలోచనలు, మతాలు. ఇంత వైవిధ్యం వున్న మనుషులు, సాధ్యమైనంత వరకు ఆ తేడాలు మరచిపోయి ప్రశాంతంగా జీవించటం చాల వింతగా వుంటుంది. ఎప్పుడో ఒకప్పుడు, అక్కడక్కడా ఈ వైవిధ్యం వల్ల జరిగే కొట్లాటలు తప్ప - విపరీతంగా ద్వేషం పెంచుకుని, ఒకళ్ళ నొకళ్ళు చంపుకునే తత్వం కనపడదు.

ఆ రోజు మాల్‌లో తిరుగుతున్న జనాన్ని చూస్తుంటే విక్రమరావ్‌కి అనిపించింది. వీళ్ళల్లో కొంతమంది రెండో, మూడో తరానికి చెందిన విదేశీయులు. మిగిలినవాళ్ళు ఈ తరంలోనే, అమెరికాకు వచ్చినవాళ్ళు. చదువుల కోసం వచ్చినవాళ్ళు, చదువులు పూర్తి చేసుకొని ఉద్యోగాలు చేసుకుంటున్నవాళ్ళు, ఉద్యోగాలు చేసుకోటానికే వచ్చినవాళ్ళు, వ్యాపార సంబంధంగా వచ్చినవాళ్ళు, దేశం చూడటానికి వచ్చినవాళ్ళు, కొన్ని దేశాల్లోని విపరీత పరిస్థితుల వల్ల వలస వచ్చినవాళ్ళు - అన్ని రకాల వాళ్ళూ వున్నారు. ఇండియా నించి ఇక్కడకు వచ్చిన వాళ్ళల్లో కూడా అంత సులభంగా వచ్చినవాళ్ళు చాల తక్కువ - పచ్చకార్డు (గ్రీన్ కార్డు) కోసం కొంతమంది పడ్డ అవస్థలు చూస్తే చాల బాధగా కూడా వుంటుంది.

"ఏం గురూ - ఇవాళ పచ్చ కార్డుల గురించి ఆలోచిస్తూ కూర్చున్నట్టున్నావ్" అన్నాడు బేతాళుడు, అప్పుడే వస్తూ.

"నీ దుంప పిలకెయ్యా. ఇక్కడ కూడా తయారయావూ" అన్నాడు విక్రమరావ్, బేతాళుడ్ని ఆశ్చర్యంగా చూస్తూ.

"మనిద్దరి సంబంధం ఈనాటిది కాదు విక్రమార్కుడూ - ఇండియాలో కొన్ని జన్మల క్రితం నించీ వస్తున్నది. అందుకే శనివారం అయినా కూడా నిన్ను చూడకుండా వుండలేకపోయాను. ఈ హ్యూస్టన్ నగరం అంతా వెదికి నిన్ను పట్టుకోటానికి నాలుగు నిమిషాలు పట్టింది మరి -" అన్నాడు.

"అవున్లే పద - నాకూ నీతో మాట్లాడుతుంటే కాస్త కాలక్షేపం - సునీతా, పిల్లలూ రావటానికి కనీసం రెండు గంటలు పడుతుంది. అలా ఫుడ్ కోర్టులో కాఫీ త్రాగి వద్దాం-" అంటూ లేచాడు విక్రమరావ్.

అమెరికా బేతాళుడు, బేతాళుడిలా కాక ఆరడుగుల తెల్ల అమెరికన్‌లా కనిపిస్తున్నాడు. పదిమందిలో వున్నప్పుడు తన రూపం మార్చుకొని అందరికి కనపడటం బేతాళుడికి అలవాటే!

ఇద్దరు ఇండియన్ కుర్రవాళ్ళు మాట్లాడుకుంటున్నారు - ముందరే నడుస్తూ.

"హెచ్ వన్ వీసాకి అప్లయి చేశాను. ఇక లేబర్ సర్టిఫికేషన్, తర్వాత గ్రీన్ కార్డు. గ్రీన్ కార్డు చేతికి రావటానికి ఇంకో సంవత్సరం పడుతుందంటారా?"

"ఈ మధ్య ఇండియాకి కోటా పెంచారని విన్నాను - సంవత్సరంలో రావచ్చు - కాకపోతే ఒక సలహా. హెచ్ వన్ మల్టిపుల్ ఎంట్రీ తీసుకుని, ఇండియా వెళ్ళి పెళ్ళి చేసుకో. వచ్చేటప్పుడు మీ ఆవిడని కూడా తీసుకురా, నీ డిపెండెంటుగా - ఇక్కడకు వచ్చాక గ్రీన్ కార్డుకి అప్లయి చేయి -"

"బాబూ నాకు గ్రీన్ కార్డుకి స్పాన్సర్ చేసే కంపెనీలో ఉద్యోగం సంపాదించటానికి తల ప్రాణం తోకకు వచ్చింది. ఇప్పుడు హెచ్ వన్‌కి అప్లయి చేస్తున్నాను. ఇంక ఇండియా పోవాలి శెలవు ఇవ్వండి అంటే, నన్ను మా కంపెనీవాళ్ళు తన్ని తగలేస్తారు -"

"నువ్వు ఇమ్మిగ్రేషన్‌కి అప్లయి చేశాక, పెళ్ళి చేసుకుందామనుకుంటే అసలు కుదరదు. నీకు వీసా వచ్చేదాకా, ఇండియా పోవటానికి కుదరదు, మల్టిపుల్ ఎంట్రీ యిస్తే తప్ప. నీకు గ్రీన్ కార్డు వచ్చాక, ఇండియా వెళ్ళి, పెళ్ళి చేసుకున్నావనుకో, అప్పుడు మీ ఆవిడ వీసాకి అప్లయి చేస్తావ్. దాని తర్వాత కనీసం రెండేళ్ళు పడుతుంది మీ ఆవిడ ఇక్కడకు రావటానికి. కొత్త పెళ్ళికొడుకు, రెండేళ్ళు విరహం అనుభవించాలి. 'నీవేనా నను తలచినది' అని పాడుకుంటూ --" వాళ్ళిద్దరూ, మాట్లాడుతూనే ప్రక్కనున్న షాప్‌లోకి దూరారు.

విక్రమరావూ, బేతాళుడూ కాఫీ షాప్‌లో చెరో కాఫీ తీసుకుని, ఖాళీగా వున్న ఒక బల్ల దగ్గర కూర్చున్నారు.

విక్రమరావ్ అన్నాడు - "చూశావా - ఆ కుర్రాడు ఇక్కడకు వచ్చి పెద్ద చదువులు పూర్తి చేశాడు. స్టూడెంట్ వీసా మీద వచ్చాడు కనుక, ఉద్యోగం చేయటానికి వీలులేదు. వెతికి,వెతికి చివరకు ఒక కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు - ఆ కంపెనీ ద్వారా వీసాకి అప్లయి చేయటానికి ఆ కంపెనీ సమ్మతించినందువలన. చాల కంపెనీలు ఈ పని చేయవు. కాని వాళ్ళకి కావలసిన చదువు, అర్హత వున్నవాడు దొరికితే, తక్కువ జీతం ఇచ్చి, వాళ్ళకు ఉద్యోగం ఇచ్చి, వీసాకి స్పాన్సర్ చేస్తారు. జీతం తక్కువయినా, వీసా వస్తుంది కనుక మనవాళ్ళు కిమ్మనకుండా ఆ ఉద్యోగంలో చేరతారు. వీసా తెచ్చుకోటానికి రెండో మూడో సంవత్సరాలు నానా యాతన పడతారు. చివరకు వీసా వచ్చిన తర్వాతే, ఇండియాకు వెళ్ళే



అవకాశం దొరుకుతుంది. ఈలోగా ఇండియాలో ముఖ్యమైన బంధువులు ఎవరయినా చనిపోయినా, చెల్లెళ్ళకీ, తమ్ముళ్ళకీ పెళ్ళిళ్ళు జరిగినా, అక్కడకు వెళ్ళే అవకాశం కుదరక కుమిలిపోయేవాళ్ళు చాలమంది వున్నారు. గ్రీన్‌కార్డు వచ్చాక ఇండియా వెళ్ళి పెళ్ళి చేసుకున్నా, అతని భార్యో, ఆవిడ భర్తో ఇక్కడకు రావటానికి కనీసం రెండేళ్ళు పడుతుంది. ఆ రెండేళ్ళు - భార్యాభర్తల జీవితంలో ఎంతో ఆనందంగా గడపవలసిన రెండు సంవత్సరాలు - వాళ్ళు వేరు వేరుగా వుండవలసిందే - ఏమిటో ఈ రూల్స్ - ఒక పట్టాన అర్థమయి చావవు -"

"ఆ అమ్మాయికో, అబ్బాయికో అమెరికా పౌరసత్వం వుంటే, వీసా వెంటనే వస్తుంది. అంత విరహం అనుభవించక్కరలేదు - కానీ ఆ పౌరసత్వం కోసం ఐదేళ్ళు ఆగాలి పచ్చకార్డు వచ్చిన తర్వాత. ఈ పచ్చకార్డుల వల్ల ఎన్ని పచ్చని సంసారాలు కష్టాలు పడుతున్నాయో చూశావా" - బేతాళుడు చెప్పటం ఆపి పెద్దగా నవ్వాడు. విచిత్రంగా చూస్తున్న విక్రమరావ్‌ని చూస్తూ - "చూశావా - నీతో మాట్లాడుతుంటే నాకు కూడా ప్రాసలు వాటడం అలవాటయింది" -

విక్రమరావ్ కూడా చిరునవ్వు నవ్వి, కాఫీ సిప్ చేసి అన్నాడు - "ఈ కష్టాలు ఎక్కువగా ఆసియా దేశాలవాళ్ళకీ, దక్షిణ, మధ్య అమెరికా వాళ్ళకూ ఎక్కువ. యూరోపియన్స్ - అంటే ముఖ్యంగా పశ్చిమ యూరప్ నించి వచ్చే తెల్లవాళ్ళకు - ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వాళ్ళకు ఇక్కడకు వచ్చి పచ్చకార్డు తెచ్చుకోవటం చాల సులభం. ఈ దేశాల్లో కొన్ని దేశాల వాళ్ళకి ద్వంద్వ పౌరసత్వం కూడా యిస్తారు. వాళ్ళు మిత్రదేశాలు కావటం వలన వాళ్ళకు కోటాలు కూడా ఎక్కువ. అందుకనే ఈ మిగతా దేశాల వాళ్ళు వీసా కోసం రకరకాలుగా కష్టాలు పడతారు. భార్యాభర్తలు నాలుగు, ఐదు సంవత్సరాలు కూడా వేరు వేరుగా వున్న కథలు

నేను చాల విన్నాను. అదీకాక ఇంకో రకం మనుషులు కూడా వున్నారు. వీసా కోసమని తెల్లవాళ్ళనో, నల్లవాళ్ళనో, పౌరసత్వం వున్న ఇండియన్స్‌నో పెళ్ళి చేసుకుని, వీసా వెంటనే తెచ్చుకునే బాపతు అన్నమాట. కొంతమంది. నిజంగా ప్రేమించి పెళ్ళి చేసుకున్నవాళ్ళు, గ్రీన్ కార్డు వచ్చాక హాయిగా వుంటున్నారు. కొంతమంది గ్రీన్ కార్డు కోసమే పెళ్ళి చేసుకునేవాళ్ళు - వీళ్ళు గ్రీన్ కార్డు రాగానే వివాహాన్ని రద్దు చేసుకుంటున్నారు. కొంతమంది పెళ్ళిచేసుకున్నాక భిన్నమైన ఆహార వ్యవహారాలతో రాజీ పడలేక విడాకులు తీసుకునేవాళ్ళు --"

బేతాళుడు అన్నాడు - "నీకు శ్రీనివాస్ అనే మీ తెలుగు అబ్బాయి కథ చెప్పానా -- చెప్పలేదులే -- నిన్ను అడగటం ఎందుకు? నాకు తెలుసు - ఇప్పుడు చెబుతాను విను -"

బేతాళుడు కథ ఎక్కడ ఎలా మొదలు పెట్టాలో, మనసులో ప్లాన్ చేసుకుంటున్నాడు. విక్రమరావ్ కొంచెం దూరంలో తెల్ల అమ్మాయిని ముద్దు పెట్టుకుంటున్న నల్ల అబ్బాయిని చూస్తూ కాఫీ త్రాగుతున్నాడు.

బేతాళుడు చెప్పటం ప్రారంభించాడు. "శ్రీనివాస్ హైదరాబాద్‌లో ఐదేళ్ళు మెకానికల్ ఇంజనీరుగా పనిచేశాడు. చాల మంచి కుర్రాడు. ఇక్కడ అంటే హ్యూస్టన్ కాదు - కాలిఫోర్నియాలోని లాస్ ఏంజిలస్‌లో ఒక రావుగారు, ముప్పయి ఏళ్ళ నుంచీ అమెరికాలో సెటిల్ అయిపోయిన పెద్దమనిషి. ఆ భార్యాభర్తలకు ఒక అమ్మాయి. పేరు రజని. రజని అమెరికాలోనే పుట్టి పెరిగి ఫార్మసీలో డిగ్రీ సంపాదించి ఒక హాస్పిటల్‌లో పని చేస్తున్నది. వాళ్ళ అమ్మా, నాన్నలతో పాటు ఇండియా వచ్చి ఎవరో బంధువులు చెప్పగా శ్రీనివాస్‌ని కలిసింది. ఇద్దరూ ఒక పది రోజులు కలిసి మాట్లాడుకుని, పెళ్ళి చేసుకుందామని నిశ్చయించుకున్నారు. నిశ్చయించుకోవటం ఏమిటి, పెళ్ళి కూడా చేసుకున్నారు. శ్రీనివాస్ రెండు నెలల్లో వీసా తీసుకుని అమెరికాకి వచ్చేశాడు కూడాను. అప్పుడే మొదలయింది అసలు కథ. అమెరికాలో పెరిగిన రజని పద్ధతి వేరు. బంధువులతో తక్కువగా మాట్లాడటం, స్నేహితులతో ఎక్కువగా మాట్లాడటం, ఏ విషయాన్నయినా నచ్చినా నచ్చక పోయినా సూటిగా చెప్పేయటం, ఏ పనినయినా చక చకా చేసేయటం, సోమవారం నుంచి శుక్రవారం దాకా పగలు ఆఫీస్ పని, సాయంత్రం ఇంటి పని - శని, ఆదివారాల్లో బీచ్‌కో, పార్క్‌కో, డాన్స్‌కో, స్నేహితులతో కలసి బయటకు పోవటం. రజని వేష భాషలు కూడా శ్రీనివాస్‌కి వింతగానే కన్పించాయి. బంగారంతో చేసిన మంగళసూత్రాన్ని, మిగతా నగలని, బాంక్ సేఫ్ డిపాజిట్ బాక్స్‌లో పెట్టేసింది - అమెరికాలో వాడే పధ్నాలుగు క్యారెట్ల సన్న గొలుసు తప్ప ఇంకేమీ నగలు పెట్టుకోదు. చీర కట్టుకోవటం యిష్టం లేదు. రాదు. తెలుగు అర్థం చేసుకుంటుంది తప్ప, మాట్లాడటం రాదు. ఇండియాలో పెరిగిన శ్రీనివాస్ ఇంకో రకం. బంధుప్రీతి ఎక్కువ. ఇండియాలో తన వాళ్ళనందర్నీ వదిలి వచ్చేశానన్న బాధ. ఇండియాలో వున్నంత అటెంషన్, అల్లుడి మీద గౌరవం అంతగా కనపడకపోవటం, స్నేహితులు ఎవరూ లేకపోవటం - ప్రతి విషయానికీ ఎవరేమనుకుంటారో అనే మొహమాటం, ఏ పని అయినా నెమ్మదిగా చేయటం

- కాఫీ త్రాగిన గ్లాసు, అన్నం తిన్న ప్లేటు సింక్ దగ్గర కడిగేసి పెట్టకుండా తిన్న చోటే వదలి వేయటం లాంటి తన పనులు తనే చేయకపోవటం. శని, ఆదివారాల్లో ప్రొద్దున టి.వి., పేపరూ - లంచ్ తర్వాత రెండు మూడు గంటల నిద్ర, వేష భాషల్లో మార్పు చేసుకోలేకపోవటం. మొత్తానికి మూడు నెలలు అవగానే రజని శ్రీనివాస్‌కి విడాకులు ఇచ్చేసింది. వాళ్ళిద్దరికీ కావాలసిన వాళ్ళకు, వాళ్ళు చెప్పిన కారణాలు మాత్రం ఒకటిగా లేవు. అతనికి అమెరికా రావాలని వుండి వచ్చాడు కానీ, అమెరికాలో నిలదొక్కుకుని అభివృద్ధిలోకి వచ్చే లక్షణాలు, పర్సనాలిటీ, పరిస్థితులకు అనుగుణంగా మారుదామనే ఉద్దేశ్యం ఏమీ లేవు.



కథా నిలయం
3847
శ్రీకాకుళం

గ్రీన్ కార్డ్ వచ్చే సులభమైన మార్గం ఇది కనుక, తనని పెళ్ళి చేసుకున్నాడు కానీ, తనంటే నిజమైన ప్రేమ లేదు. అందుకనే విడాకులు యిచ్చానంటుంది రజని. ఆ అమ్మాయిలో తన మీద ఏ మాత్రం ప్రేమ, గౌరవం, మర్యాద, మన్నన ఏమీ లేవు. వెరీ సెల్ఫ్ సెంటర్డ్. తన సుఖమే తప్ప మిగతా వాళ్ల సుఖం గురించి ఏ మాత్రం ఆలోచించదు. పేరులోనూ, కుటుంబ చరిత్రలోనే తప్ప ఇంకెక్కడా భారతీయ సంస్కృతి కనపడదు. తనలాంటి వాడిని పెళ్ళి చేసుకుని, దేశం కాని దేశం తీసుకువచ్చి, విడాకులు యివ్వటం, తడిగుడ్డతో గొంతు కోయటమేనంటాడు శ్రీనివాస్. వాళ్ళని కలపటానికి చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. అసలు కారణం బయటకు రాలేదు కానీ, వాళ్ళ పచ్చని సంసారం ముక్కలయింది" - బేతాళుడు ఆగాడు.

"అవును - ఇలాంటి కథలు ఇక్కడ వింటూనే వున్నాం!" అన్నాడు విక్రమరావ్.

"వినటం కాదు విక్రమార్కుడూ - నాకు జవాబు కావాలి - అసలు ఏమి జరిగివుంటుంది ఈ విషయంలో - ఊహించి ఈ కథకు ముగింపు చెప్పు - కథ 'కాలరాడో' కి మనం ఇంటికి పోవచ్చు - లేదా నీ తల వేయి ...."

అతన్ని ఆగమని చేత్తో సంజ్ఞ చేశాడు విక్రమరావ్. ఒక క్షణం ఆలోచించి అన్నాడు - "నువ్వు చెప్పిన కథలో రెండురకాల మనస్థత్వాలు - కాదు - నిజ జీవితంలో జరిగే 'నాలుగు రకాల' కథలు వున్నాయి. వీసా కోసం అమెరికా అమ్మాయిని పెళ్ళి చేసుకుని, అమెరికా వచ్చి విడాకులు కోరే అబ్బాయిల కథలు విన్నాం. వాళ్ళకి పచ్చని సంసారం కన్నా, పచ్చకార్డే ముఖ్యం. రెండో రకం కథ మనస్ఫూర్తిగా ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకుని ఇక్కడకు వచ్చి కూడా ఇండియాలోలాగా బ్రతకాలనుకోవటం ఒక పెద్ద తప్పు. 'బి ఎ రోమన్ ఇన్ రోమ్' అన్నారు. నలుగురితోనూ నారాయణా. ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా మారకపోతే ఈ కథకు ముగింపు శుభప్రదంగా వుండదు. మూడో కథ రజని తన అమెరికనైజ్డ్ మనస్థత్వానికి తగ్గ మనిషి కావాలనుకున్నప్పుడు ఇక్కడే అమెరికాలోనే ఎవర్నయినా పెళ్ళి చేసుకుంటే బాగుండేది. ఇక్కడ మనవాళ్ళు చాలమంది ఈ రోజుల్లో, తెల్ల - నల్ల అమెరికన్స్‌నే పెళ్ళి చేసుకుంటున్నారు. అలాకాక ఇండియా నుంచి వచ్చిన అమెరికన్స్ (అమెరికన్ పౌరసత్వం తీసుకున్నవాళ్ళు లేక రెండో, మూడో తరానికి చెందిన భారతీయ అమెరికన్లు) నే కావాలనుకున్నా పుష్కలంగా వున్నారు. ఇండియాలో పుట్టి పెరిగిన వాళ్ళ మనస్థత్వం - ఇక్కడ పుట్టి పెరిగిన వాళ్ళ మనస్థత్వంతో కలవటం చాల అరుదు. ఇక నాలుగో కథ - రజని అతన్ని పెళ్ళి చేసుకున్నది కనుక అతన్ని తప్పకుండా కావాలనుకున్నది అని అర్థం అవుతుంది. ఇద్దరి మనస్థత్వాలు వేరుగా వున్నందువలన ఇద్దరూ కలిసి కూర్చుని ఏ విషయాల్లో యిద్దరూ ఏకీభవిస్తున్నారో, ఏ విషయాల్లో ఇద్దరూ ఎంత వరకూ తమ దృక్పథాన్ని మార్చుకోవాలో మాట్లాడుకోవలసింది. ఇద్దరూ పెద్ద చదువులు చదువుకున్న తెలివిగల మనుష్యులు. ఆలోచించి చక్కని పరిష్కారం చేసుకోగల సమర్థులు. వేరు వేరు మనస్థత్వాలు వుండటం తప్పు కాదు. వాళ్ళు పెరిగిన వాతావరణం, సంస్కృతి వాళ్ళ మనసుల్లోని భావాల మీద చాల

ప్రభావం చూపుతుంది. వాళ్ళ సంసారం పాడయిపోవటానికి కారణం వాళ్ళు ఆ రెండింటిలోనూ వున్న మంచిని గ్రహించి, వాళ్ళకు అనుగుణంగా మలుచుకోలేకపోవటమే -'' విక్రమరావ్ జవాబు చెప్పాడు.

"బాగా చెప్పావు విక్రమార్కుడూ - అందుకేనయ్యా, నేను నీ వెంబడి పడేది - ఓ.కే. నాకే వేరే పని వుంది - నేను పోతున్నాను. మళ్ళీ కలుద్దాం. మీ ఆవిడ షాపింగ్ పూర్తి చేసుకుని ఫౌంటెన్ దగ్గరకు వచ్చి వుంటుంది - ఇక వెళ్ళు -'' అని బేతాళుడు అంతర్ధానమయాడు.

అతను అంతర్ధానమవటం చూసిన తెల్ల బొచ్చుకుక్క "భౌ - భౌ" - మంది ఏమనాలో అర్థం కాక.

"క్వయిట్ - రోమీ క్వయట్" అన్నాడు, ఆ కుక్క యజమాని - చూడటానికి చైనీస్ లాగా వున్నాడు.

విక్రమరావ్ లేచి - ఫౌంటెన్ వేపు నడిచాడు.

❖